RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, జూన్ 19, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 59 | పేజీలు: 8 | వెల : రూ.1



## రికార్డుస్థాయి వరి దిగుబడి

# డీలిమిటేషన్‌కు లైన్ క్లియర్

### టూథర్డ్ మెజార్టీకి ఒక్కో అడుగు



న్యూఢిల్లీ జూన్ 18 : మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత భారత రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. కేవలం రెండు వారాల వ్యవధిలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు నేషనల్ పాలిటిక్స్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నిన్నటి వరకు ప్రతిపక్షాల ఐక్యతతో వెనక్కి తగ్గిన మోదీ, ఇప్పుడు వారందర్నీ కోలుకోలేని దెబ్బ తీస్తున్నారు. అంతేకాకుండా రాజ్యాంగ సవరణ బిల్లుకు కూడా లైన్ క్లియర్ చేసుకుంటున్నారు. గడిచిన ఏప్రిల్ నెలలో లోక్‌సభలో కేవలం 54 ఓట్ల తేడాతో ఆగిపోయిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులకు ఇప్పుడు మోదీ ప్రభుత్వం మళ్లీ ప్రాణం పోయబోతోంది.విపక్ష కూటమిలో మొదలైన ముసలం, రీజనల్ పార్టీల చీలికలు ఎన్డీఏకు వరంగా మారాయి. బెంగాల్‌లో మమతా బెనర్జీకి షాక్ ఇస్తూ తృణమూల్ కాంగ్రెస్ చీలిపోవడం, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరే వర్గం నుంచి కూడా ఎంపీలు జారిపోతుండటంతో ఢిల్లీలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి ఒకటే నెంబర్‌పై ఉంది. అది మ్యాజిక్ నెంబర్ 6. అవును ప్రభుత్వం అనుకున్నది సాధించాలంటే ఇప్పుడు కేవలం ఆరు ఓట్లు మాత్రమే తక్కువగా ఉన్నాయి. ఈ రాజకీయ చదరంగంలో ఎన్డీఏ విజయం సాధిస్తే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వంటి కీలక సంస్కరణలు మార్గం సుగమంకానుంది.రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం అనడానికి ప్రస్తుత పరిణామాలే నిదర్శనం.పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో ఊహించని చీలక వచ్చింది. లోక్‌సభలో ఉన్న 28 మంది టీఎంసీ ఎంపీలలో ఏకంగా 20 మంది తిరుగుబాటు చేస్తున్నారు. వీరంతా కలిసి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యారు. ఈ వర్గం ఇప్పుడు ఎన్డీయేకు మద్దతు తెలపడం దాదాపు ఖాయమైంది.మరోవైపు మహారాష్ట్ర లోనూ ఇదే సీన్ రిపీట్ అవుతోంది. ఉద్ధవ్ థాకరేకు చెందిన శివసేన నుంచి తొమ్మిది మంది ఎంపీల్లో 6 మంది బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. వీరు ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరితే , ఎన్డీఏ బలం అనూహ్యంగా పెరుగుతుంది. ఈ పరిణామాలన్నీ జులైలో జరగబోయే వర్షాకాల సమావేశాల నాటికి పూర్తి కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించాలంటే లోక్‌భలో 2/3 మెజారిటీ అవసరం. ప్రస్తుత లెక్క చూస్తే. లోక్‌సభలో మొత్తం సీట్లు 543ఇందులో మూడు

(మిగతా 2వ పేజీలో)



## ఈ-కేబినెట్ విధానానికి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూన్ 18 : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ సమావేశాలను డిజిటల్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ విధానం అమలు కోసం రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అమలులో ఉన్న క్యాబినెట్ డిజిటల్ విధానాన్ని తెలంగాణ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసి అమలు చేయనున్నారు.

**ప్రధాన అంశాలు:**


- నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సర్వీసెస్ ఇన్‌కార్పొరేటెడ్ (చీ×జూ×)తో చర్చలు జరిపి సాఫ్ట్‌వేర్‌ను అనుకూలీకరిస్తున్నారు.
- తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీడీటీఎస్)ను నోడల్ ఏజెన్సీగా నియమించారు.
- ప్రాజెక్టు మొదటి విడతగా రూ.20 లక్షల నిధులు విడుదల చేశారు.
- ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ట్యాబ్‌లు, కంప్యూటర్ల ద్వారా ఎజెండాలు, ఫైల్స్ పరిశీలించవచ్చు.
- క్యాబినెట్ నోట్స్, ప్రతిపాదనలు, నిర్ణయాలు పూర్తిగా డిజిటల్ రూపంలో ఉంటాయి.ఈ విధానం ద్వారా పరిపాలనలో వేగం, పారదర్శకత, సౌలభ్యాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డేటా లీకేజీ, హ్యాకింగ్ నివారణకు ప్రత్యేక లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, బలమైన సెక్యూరిటీ వ్యవస్థలను అమలు చేయనున్నారు.

# పీవీ నరసింహారావు జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 18:లి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన కేటీఆర్, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, 16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి, ప్రపంచానికి ఆదర్శప్రాయమైన వ్యక్తిగా నిలిచారని అన్నారు. పీవీ చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు విద్యలో రాణించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుందని, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన కేటీఆర్, పాఠశాలకు అవసరమైన అదనపు తరగతి గదులు,



ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి సహాయం చేస్తామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## హార్మూజ్ జలసంధి తెరుచుకుంది

న్యూఢిల్లీ జూన్ 18 ( వాయిస్ టుడే) : మిడిలీస్ట్‌ను కుదిపేసిన ఇరాన్-అమెరికా యుద్ధానికి ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ యుద్ధ విరమణకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. అయితే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా అమలు చేస్తుందా లేదా అన్నదానిపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది.ఈ ఒప్పందం తర్వాత ఇరాన్ ఒక ప్రకటన చేసింది. శాంతి ఒప్పందంపై చర్చలు పూర్తయ్యాని పేర్కొంది. ఒప్పంద అములుకు ఇది పరీక్ష సమయం అని తెలిపింది. అయితే ఈ రెండు దేశాల మధ్య దాదాపు 14 అంశాలపై రాజీ కుదిరినట్టు తెలుస్తోంది. ఈ 14 అంశాలకు ఏవి అని కూడా తాజాగా అమెరికా ప్రకటించింది. లెబనాన్‌తో పాటు అన్ని వైపులా సైనిక చర్యల నిలిపివేతకు అమెరికా అంగీకరించింది.ఇరాన్-అమెరికా తుది ఒప్పందానికి 60 రోజుల గడువు ఉంటుంది. పరస్పర అంగీకారంతో ఇరు దేశాలు ఈ గడువును పెంచుకోవచ్చు.30 రోజుల్లో హర్మూజ్ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేసి, టోల్ లేకుండా ఇరాన్ నౌకలను అనుమతించాలి.. ఇరాన్ పునర్నిర్మాణ కోసం 300 బిలియన్ డాలర్ల నిధి ఏర్పాటు చేస్తారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ తయారు చేయకూడదని ఇరాన్ అంగీకరించింది. అలాగే ఆంక్షలు ఎత్తివేసే వరకు స్వేచ్ఛగా చమురు అమ్ముకునేందుకు అంగీకరించాలని ఇరాన్ కోరింది. అయితే ఈ మొత్తం 14 అంశాల్లో యురేనియం సంబంధించి ఎక్కడా ప్రస్థావన జరగలేనట్టు కనిపిస్తోంది



## మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు పూర్తిచేసి తీరుతాం: సీఎం రేవంత్

### వనమహోత్సవం-2026 ప్రారంభం.. రూ.35.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

హైదరాబాద్, జూన్ 18 (వాయిస్ టుడే):లి తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే ప్రతిష్టాత్మక మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోని ఢిల్లీ, ముంబయి, బెంగుళూరు వంటి మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, వరదల సమస్యలు హైదరాబాద్‌కు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని గుర్రంగూడ ఎకోపార్క్‌లో వనమహోత్సవం-2026 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్క నాటి, ఎకోపార్క్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను

(మిగతా 2వ పేజీలో)

### రెండున్నరేళ్లలో 66,038 రైతు కుటుంబాలకు

## రూ.3,301.90 కోట్ల రైతు బీమా సాయం

### ఎల్ఐసీకి వార్షిక ప్రీమియం పూర్తిగా చెల్లించాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, జూన్ 18 (వాయిస్ టుడే):లి రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు బీమా పథకాన్ని నిలిపివేశారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని ఆయన స్పష్టం చేశారు. రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని పేర్కొన్న మంత్రి, రైతు బీమా పథకం అమలులో భాగంగా ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే పూర్తిగా చెల్లించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ధి పొందాయని తెలిపారు. ఈ కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ.3,301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 రైతు కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

శుక్రవారం, జూన్ 19, 2026

# అమెరికాలో జీ20 పెట్టుబడి సదస్సు.. సీఎం రేవంత్‌కు ప్రత్యేక ఆహ్వానం

## ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు



హైదరాబాద్, జూన్ 18 (వాయిస్ టుడే):లి ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రానికి పెరుగుతున్న ప్రాధాన్యతకు గుర్తింపుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామికి అమెరికాలో నిర్వహించనున్న జీ20 సార్వభౌమ సంపద నిధుల పెట్టుబడి వారోత్సవం (G20 Sovereign Wealth Fund Investment Week)లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. 2026 ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 4 వరకు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరంలో ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు జరగనుంది. అమెరికా జీ20 అధ్యక్షత ప్రాధాన్యతలకు అనుగుణంగా సార్వభౌమ సంపద నిధుల సంస్థ (SWFI) చైర్మన్ లక్ష్మీనారాయణన్ ఈ ఆహ్వానాన్ని అందజేశారు. తెలంగాణలో అమలవుతున్న పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక అవకాశాల విస్తరణ, ప్రగతిశీల పాలనకు అంతర్జాతీయ స్థాయిలో లభిస్తున్న గుర్తింపునకు ఈ ఆహ్వానం నిదర్శనంగా భావిస్తున్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ఐ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అధికారిక ఆహ్వాన పత్రాన్ని అందజేసింది. ముఖ్యమంత్రి, మంత్రి వివేక్ వెంకటస్వామికి ఆహ్వానం అందడం తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల పటంలో పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సార్వభౌమ సంపద నిధులు, ప్రభుత్వ పెన్షన్ ఫండ్లు, కేంద్ర బ్యాంకులు, ప్రముఖ ఆస్తుల నిర్వహణ సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. 50కి పైగా సంస్థాగత పెట్టుబడి వర్గాలకు చెందిన 10 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తున్న ప్రతినిధులు హాజరుకానున్నారు.

మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి, గనుల రంగం, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రపంచ పెట్టుబడిదారులతో నేరుగా చర్చించే అవకాశం ఈ సదస్సు ద్వారా లభించనుంది.

అంతర్జాతీయ పెట్టుబడి ధోరణులు, మూలధన ప్రవాహాలు, కొత్త ఆర్థిక అవకాశాలపై ఉన్నతస్థాయి విధాన చర్చలకు కూడా ఈ వేదిక ఉపయోగపడనుంది. ద్వైపాక్షిక, బహుళపాక్షిక పెట్టుబడి భాగస్వామ్యాలను మరింత వేగవంతం చేసే అవకాశాలు ఈ సమావేశం ద్వారా ఏర్పడనున్నాయి.

తెలంగాణ ప్రతినిధుల భాగస్వామ్యం రాష్ట్రానికి మరింత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు పరిశ్రమలు, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

ప్రపంచ స్థాయి పెట్టుబడులకు తెలంగాణను ప్రాధాన్య గమ్యస్థానంగా నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఈ ఆహ్వానం మరో కీలక మైలురాయిగా నిలిచింది.

# మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు పూర్తిచేసి తీరుతాం: సీఎం రేవంత్



తిలకించారు. వనమహోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వనాల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన రూ.35.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా నిజామాబాద్, కొత్తగూడెం, హనుమకొండ, మెదక్, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట, భూపాలపల్లి, సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో రూ.17.66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, జూ ఆధునీకరణ, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మూసీ నది ప్రక్షాళనపై ప్రభుత్వం పూర్తిస్థాయి కట్టుబాటుతో ఉందన్నారు. “ఎవరేమనుకున్నా మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతాం. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ ప్రమాణాలతో మూసీ రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడం నా బాధ్యత. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తాం. సబర్మతి, గంగా, యమునా నదుల రివర్‌ఫ్రంట్‌ల కంటే అద్భుతంగా మూసీ రివర్‌ఫ్రంట్‌ను తీర్చిదిద్దుతాం” అని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితమైందని, ఎల్‌బీ నగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, గుర్రంగూడ, బైరామల్‌గూడ, సాయబ్‌నగర్ వంటి ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ఈ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగానే రూ.2,400 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల ఫ్రూట్ మార్కెట్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. గుర్రంగూడ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నించినప్పటికీ, సుప్రీంకోర్టులో బలంగా వాదించి భూములను రక్షించుకున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో 100 ఎకరాలను నేషనల్ పార్క్ కోసం కేటాయించినట్లు చెప్పారు. ఎల్‌బీ నగర్ పరిధిలో 424 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పార్క్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. చెరువులు, నాలాలు, పార్కులపై ఆక్రమణల వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి గతంలో అనేక కాలనీలు ముంపునకు గురయ్యాయని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా ఉండేందుకే హైడ్రాను ఏర్పాటు చేశామని చెప్పారు. “చెరువులు, పార్కులు, నాలాలను ఆక్రమిస్తే హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటుంది. కొద్దిమంది అక్రమాల కారణంగా వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితిని సహించబోము” అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గులాబీ ఓవర్ కాన్ఫిడెన్సేనా




హైదరాబాద్ జూన్ 18, ( వాయిస్ టుడే) తెలంగాణలో బీఆర్ఎస్ తన ఓట్ల శాతాన్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే పెంచుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు తమకు అనకూల ఓటు పెరుగుతుందని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బీఆర్ఎస్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. మరొకవైపు బీజేపీ బలపడుతుంది. బీజేపీ తమ ఓటు బ్యాంకును చీల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పై వ్యతిరేక ఓటును తాము రాబట్టుకునే ప్రయత్నంలో కారు పార్టీ ఉంది. పార్టీ అగ్రనేత కేసీఆర్ సూచనల మేరకు కీలక నేతలు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు.సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖచ్చితంగా అంతో ఇంతో వ్యతిరేకత ఉంటుంది. పాజటివిటీ కంటే నెగిటివిటీ ఓటు ఎక్కువగా ఉంటుంది. అందుకు కాంగ్రెస్ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే గతంలో బీఆర్ఎస్ రెండు దఫాల తర్వాత వచ్చిన వ్యతిరేకతతోనే కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎప్పుడూ పదేళ్లు ఒకే పార్టీ ఉంటుందని అనుకోవడం కేవలం గణాంకాల కోసమే. ప్రాక్టికల్ గా కుదరదు. మరొకవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు బీజేపీ నుంచి కూడా ప్రమాదం పొంచి ఉంది. బీజేపీ ఎంత బలపడితే అంత కాంగ్రెస్ కే నష్టమన్న అంచనాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటు వెళుతుందన్నది పక్కన పెడితే మూడు పార్టీలు బలంగా ఓట్లు చీల్చుకుంటే అది తమకే లాభమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. తమకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న మద్దతు అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు. ప్రస్తుతానికి కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇటు క్యాడర్ తో పాటు ఓటు బ్యాంకును కూడా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తమ పాలనకు, ప్రస్తుత పాలనకు బేరీజు వేసుకుంటే తామే ఎక్కువ ఓట్లు సాధిస్తామని గులాబీ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లోనూ అనేక నియోజకవర్గాల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో తమకు అధికారం గ్యారంటీ అన్న ధీమాతో ఉంది. మరి చివరకు ఓటర్లు ఎలా తీర్పు చెబుతారన్నది చూడాల్సి ఉంది.

# రికార్డుస్థాయి వరి దిగుబడి

## తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు

హైదరాబాద్, జూన్ 18, ( వాయిస్ టుడే) : దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి. ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది.ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది.సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# డీలిమిటేషన్‌కు లైన్ క్లియర్

ఖాళీగా ఉన్నాయి అంటే 540 అన్నమాట. రాజ్యాంగ సవరణకు కావాల్సిన ఓట్లు 360. ప్రస్తుతం ఎన్డీఏ బలం 318 మాత్రమే. ఇంకా 42 ఓట్లు కావాల్సి ఉంది. అయితే గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు 528 మంది ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. ఆ లెక్కన చూస్తే మెజారిటీకి మార్క్ 352కి పడిపోతుంది. ఆ సమయంలో ప్రభుత్వం కేవల 298 ఓట్లు మాత్రమే సాధించగలిగింది. కానీ ఇప్పుడు సీన్ మారింది. టీఎంసీ రెబల్స్ 20 మంది, థాకరే శివసేన రెబెల్స్ 6 మంది కలిస్తే ఎన్డీఏ బలం 344కు చేరుతుంది.

### డీఎంకే మద్దతు ఎవరికి?

ఈ మొత్తం సమీకరణంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కీలకంగా మారింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియన్ బ్లాక్ నుంచి డీఎంకే బయటకు రావడంతో కేంద్ర ప్రభుత్వం వారితో చర్చలు జరుపుతోంది. డీఎంకేకి ఉన్న 22 మంది లోక్‌సభ ఎంపీలు ఒక వేళ ప్రభుత్వానికి మద్దతు ఇస్తే, ఎన్డీఏ బలం 348కు చేరుతుంది. ఈ స్థితిలో రాజ్యాంగ సవరణకు ప్రభుత్వం కేవలం 6 ఓట్ల దూరంలో మాత్రమే ఉంటుంది. ఈ ఆరు ఓట్లు చిన్న చిన్న పార్టీల నుంచి లేదా సమాజ్‌వాది పార్టీలోని అసమ్మతి వర్గం నుంచి సేకరించడం పెద్ద కష్టం కాదని బీజేపీ భావిస్తోంది.లోక్‌సభ మాత్రమే కాదు, రాజ్యసభలోనూ ఎన్డీఏ తన పట్టు బిగిస్తోంది. రాజ్యసభలో రాజ్యాంగ సవరణకు 164 ఓట్లు అవసరం. ప్రస్తుతం ఎన్డీయేకు 150 మంది సభ్యులు ఉన్నారు. ఒక వేళ డీఎంకేకు చెందిన 8 మంది ఎంపీలు మద్దతు ఇస్తే, ఆ బలం 158కి చేరుకుంది. ఇక్కడ కూడా మ్యాజిక్ నంబర్ కోసం ఆరు ఓట్లు మాత్రమే కావాలి. త్వరలో జరగబోయే రాజ్యసభ ఉపఎన్నికల ద్వారా లోటు భర్తీ చేసుకోవాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది.ఈ మ్యాజిక్ నెంబర్ సాధించిన వెంటనే మోదీ సర్కారు అత్యంత ప్రతిష్టాత్మకమైన డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకురానుంది. దీని వల్ల దేశవ్యాప్తంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. దీంతోపాటు చట్టసభల్లో మహిళలకు 33 శాతం కోటా అమల్లోకి వస్తుంది. ముఖ్యంగా జనాభా ప్రాతిపదికన ఉత్తర భారత రాష్ట్రాల్లో సీట్లు పెరిగే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే బిల్లును కూడా ప్రభుత్వం ప్రవేశ పెట్టే ఛాన్స్ ఉంది

# రెండున్నరేళ్లలో 66,038 రైతు కుటుంబాలకు రూ.3,301.90 కోట్ల రైతు బీమా సాయం

25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు మంత్రి వివరించారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 20,087 కుటుంబాలకు రూ.1,004.35 కోట్లు బీమా సహాయం అందించినట్లు తెలిపారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్‌ఐసీకి చెల్లించాల్సిన రూ.1,359.56 కోట్ల వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని తమ ప్రభుత్వం నిలిపివేయలేదని మంత్రి స్పష్టం చేశారు. పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదేనని విమర్శించారు. వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్టులు, సబ్సిడీ విత్తనాల పంపిణీ వంటి పథకాలను గత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. అలాగే రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో కేంద్ర ప్రాయోజిత పథకాల ప్రయోజనాలు కూడా రైతులకు అందకుండా చేశారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో అమలులో ఉన్న పథకాలను కొనసాగించడమే కాకుండా, నిలిచిపోయిన పథకాలను పునరుద్ధరించి రైతులకు అండగా నిలుస్తోందని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, రైతు మరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో రైతు బీమా పథకం కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల

## 7 రకాల సన్న ధాన్యానికి బోనస్.. మధిరలో భారీ రైతు సమ్మేళనం



హైదరాబాద్, జూన్ 18 (వాయిస్ టుడే): వానాకాలం పంటలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా మధిరలో భారీ స్థాయిలో రైతుల సమ్మేళనం నిర్వహించి, అదే వేదికపై రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రులు వెల్లడించారు. సమావేశం అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క మీడియాకు వివరాలు వెల్లడించారు. రైతుల ఖాతాల్లో నేరుగా రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియను మధిర రైతు సమ్మేళనంలో ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ఏడు రకాల సన్నాలకు బోనస్ ప్రకటించింది. మార్కెట్‌లో డిమాండ్, ప్రజల వినియోగం, అధిక దిగుబడి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 రకాల ధాన్యాలకు బోనస్ వర్తించనుంది. ఈ ఏడాది తెలంగాణ రైతులు దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేశారని, ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని మంత్రులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ నుంచి తక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరింది. కేంద్రం నిర్దేశించిన విధి విధానాల ప్రకారం పంట కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని పేర్కొంది. వానాకాలం సాగుకు అవసరమైన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ త్వరలో ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలవాలని నిర్ణయించారు. తెలంగాణలోని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో అధిక భాగాన్ని తెలంగాణకే కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఇతర రాష్ట్రాలకు తరలించకుండా రాష్ట్ర అవసరాలకు వినియోగిస్తే రవాణా వ్యయాలు తగ్గుతాయని అభిప్రాయపడింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని సమావేశం తీర్మానించింది. కేంద్రం ప్రతిపాదిస్తున్న కొత్త విధానాల ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వివేక్ వెంకటస్వామిలతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు అవసరమైన అనుమతులు, ఐఆర్ఎఫ్‌సీ రుణాలను వెంటనే మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొంది. అలాగే ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ స్థాయి నీట్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 208 కేంద్రాల్లో సుమారు 2.95 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని సమావేశం నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు.

# సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం

## అడ్డుకున్న పోలీసులు.. గన్ పార్కు వద్ద అరెస్టులు



హైదరాబాద్, జూన్ 18(వాయిస్ టుడే ): రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా,తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్"కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళులర్పించారు.అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు.తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లకార్డులతో నినదించారు.




అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్,ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకపోతే రాబోయే కాలంలో గత ప్రభుత్వాని పట్టిన గతే ఈ ప్రజా ప్రభుత్వానికీ పడుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా కార్యాధ్యక్షుడు గండీటి నర్సింహా, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం,గడ్డమీది అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కుత్బుల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్ జూన్ 18(వాయిస్ టుడే ): ఈ సందర్భంగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మరియు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు,డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యాని శివ కుమార్,డీసీసీ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి,అవిజే జేమ్స్ సిద్దనోల సంజీవరెడ్డి,లక్ష్మా రెడ్డి, రషీద్,మైసిగారి శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్,సంతోష్ ముదిరాజ్ ,లాయక్, అజయ్, ప్రవీణ్ ముదిరాజ్ రంగన్న, మధుసూదన్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## ఘనంగా శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి దేవస్థానంలో వికారి శ్వారి క్రతు జీవహోత్తవ ఆహ్వాన కార్యక్రమం



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ నియోజకవర్గం లోని మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని మంగపురం లో గోదాదేవి రంగనాథ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వికారి శ్వారి క్రతు జీవహోత్తవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు అతిథులకు సాదర స్వాగతం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడిన ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.

## ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి

### :- ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

### భరత్ నగర్ బురుజు గల్లిలో రూ.1.26 కోట్లతో సీసీ రోడ్డు పనులు



ఉప్పల్, (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ డివిజన్‌ను సమస్యలు లేని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ భరత్ నగర్ బురుజు గల్లిలో రూ. 1 కోటి 26 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మౌలిక వసతుల కల్పనే మా ప్రధాన లక్ష్యం. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్‌ను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతామని,నాణ్యతతో కూడిన పనులు జరిగేలా ప్రతి పనిని స్వయంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సుడుగు నవీన్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, మేకల రామ్ రెడ్డి, జిత్తు, మేకల మధుసూదన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, రాఘవేంద్ర, హనుమంత్, గుండాల అనిల్ రెడ్డి, మునుగొండ జగన్, సోమ్ బాలమణి, నక్క పార్వతమ్మ, బబ్బురావు, మోత్కూరి శ్రీహిత్ బాబీ, కొత్త వంశీ, గొండి ప్రశాంత్ రెడ్డి, దీపక్ గౌడ్, నవీన్ గౌడ్, కార్తీక్ పాల్గొన్నారు.

## పసి ప్రాణాన్ని కాపాడిన సీఎం ప్రజావాణి

ఖైరతాబాద్: సీఎం ప్రజావాణి కార్యక్రమం చొరవతో ఒక పసి ప్రాణం నిలిచింది. సీఎం ప్రజావాణి బృందం వేగంగా స్పందించడంతో పుట్టుకతోనే హృదయ సంబంధిత సమస్య ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ ది గ్రేట్ ఆర్టరీస్‌తో బాధపడుతున్న చిన్నారికి సకాలంలో శస్త్రచికిత్స జరిగింది. ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన దినసరి కూలీ ఆంజనేయులుకు ఇటీవల కుమార్తె గ్రేసీ జన్మించింది. పుట్టుకతోనే తీవ్ర అనారోగ్య సమస్యలు ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చూపించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు... సర్జరీకి భారీ ఖర్చు అవుతుందని చెప్పడంతో వారు సీఎం ప్రజావాణిని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన సిబ్బంది... గ్రేసీని స్టార్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు విషయం తెలిపి.. వెంట్రిక్యులర్ సెప్టాల్ డిఫెక్ట్ శస్త్రచికిత్స జరిగేలా చర్యలు తీసుకున్నారు. చికిత్సకు అవసరమైన రూ.8 లక్షలు విడుదల చేయించారు. ప్రజావాణి బృందానికి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.



## బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఆర్థిక సహాయం

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా,బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ చదువుతున్న 5 మంది విద్యార్థులకు సుమారు రూ.3 లక్షల విలువైన చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి గారు అందజేశారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటునందించడం ద్వారా వారి ఉన్నత విద్యా లక్ష్యాలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్నినిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు సమాజానికి సేవ చేసే ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్య ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌కు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.



## డంపింగ్ యార్డ్ రాత్రి పూట చెత్త తగలబెడుతున్న గుర్తుతెలియని వ్యక్తులు

### పొగతో ఇబ్బంది.. ఆందోళన చేసిన స్థానికులు

రాంపల్లి--చర్లపల్లి మార్గంలోని డంపింగ్ యార్డును పరిశీలించిన అధికారులు

నాగారం, జూన్ 18:-(వాయిస్ టుడే): రాంపల్లి నుండి చర్లపల్లి వెళ్లే మార్గంలోని డంపింగ్ యార్డులో రాత్రివేళల్లో చెత్తను కాల్చడం వల్ల కాలనీల వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పొగతో చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత ఇబ్బంది పడుతున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆందోళనకు దిగారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిశీలించాలని డిమాండ్ చేయడంతో గురువారం జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఐఎఎస్, డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి, ఆల్ కాలనీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఆల్ కాలనీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్, రామ్ రెడ్డి, రామకృష్ణ, కాలనీల వాసులు కలిసి డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా రాధికా గుప్తా ఐఎఎస్ డంపింగ్ యార్డులోని చెత్తను తక్షణమే తొలగించాలని, వాహనాల రాకపోకలకు ఒకే మార్గాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.



## ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు జోయాలుక్కాస్ స్కూల్ బ్యాగుల పంపిణీ

నాచారం (వాయిస్ టుడే): విద్యార్థుల విద్యావసరాలకు తోడ్పాటునందిస్తూ జోయాలుక్కాస్ హాబ్సిగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (MPPS) విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలలోని 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు చదువుతున్న 100 మంది విద్యార్థులకు ఈ బ్యాగులను అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రతి బ్యాగులో ఒక గొడుగు, వాటర్ బాటిల్, లంచ్ బాక్స్ మరియు పెన్సిల్ బాక్స్ వంటి వస్తువులను ఉంచారు. ఈ కార్యక్రమంలో హాబ్సిగూడ మాజీ కార్పొరేటర్ చైతన్య మేడం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్. విజయ్ కుమార్, జెడ్పీహెచ్ఎస్ హాబ్సిగూడ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఉపేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు బ్యాగులను అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. సుజాత, ఎ. కల్యాణి, చ. అనిత, కె. శ్రీదేవి మరియు కుమారి పాల్గొన్నారు.

## తాజ్ కృష్ణ హోటల్లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశం



### పాల్గొన్న కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ జూన్ 18(వాయిస్ టుడే ): ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు కరీంనగర్ జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై ముందుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేయడం జరిగింది. సమావేశం అనంతరం కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ జన్మదినం సందర్భంగా మంత్రులు మరియు స్థానిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు శ్రీశైలం గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కటింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మేడిపల్లి సత్యం విజయ రమణారావు, కవ్వంపల్లి సత్యనారాయణ మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ నియోజకవర్గ ఇన్చార్జ లు, ప్రణవ్ కే .కే మహేందర్ రెడ్డి మరియు జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఔటర్‌పై 11 ఏళ్ల కుమారుడికి స్టీరింగ్.. అరెస్టు చేసిన పోలీసులు

రాజేంద్రనగర్: అది వాహనాలు అత్యంత వేగంగా దూసుకెళ్లే బాహ్యవలయ రహదారి. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు రక్తమోడుతాయి. అలాంటి రహదారిపై ఓ తండ్రి తన 11 ఏళ్ల కుమారుడికి ఖరీదైన కారు స్టీరింగ్ ఇచ్చి డ్రైవింగ్ చేయిస్తూ మురిసిపోయాడు. కానీ చట్టప్రకారం అది నేరమనే విషయాన్ని మరిచిపోయాడు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ సీహెచ్ రాజు తెలిపిన మేరకు.. టోలీచౌకీకి చెందిన అబ్దుల్ హాదీ ఇటీవల ఖరీదైన కారు కొన్నాడు. ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి ఔటర్‌పై శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వెళ్లే మార్గంలో కారును తన కుమారుడికి ఇచ్చి డ్రైవింగ్ చేయించాడు. అదే దారిలో మరో కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. అది వైరల్‌గా మారడంతో పాటు పలువురు 'ఎక్స్'లో ట్రాఫిక్ పోలీసుల ఖాతాకు ట్యాగ్ చేశారు. వీడియో ఆధారంగా విచారించిన పోలీసులు కారు యజమానిని గుర్తించారు. డ్రైవింగ్ చేసింది అతని కుమారుడనే విషయం తెలియడంతో తండ్రిని అదుపులోకి తీసుకొని కారు స్వాధీనం చేసుకున్నారు. బాలుడికి కారు ఇచ్చిన కారణంగా పల సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపారు.

వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 19 జూన్ 2026

# కాంగ్రెస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు..

## ఏ ఎన్నికలైనా బీఆర్ఎస్ విజయమే: ఎంపీ వద్దిరాజు"



కొత్తగూడెం, జూన్ 18 (వాయిస్ టుడే): రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ విజయదుందుభి మోగించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం కొత్తగూడెంలో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) మరియు సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రజా సంక్షేమం, అభివృద్ధిని పక్కనపెట్టి సొంత ప్రయోజనాలపై దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే ప్రస్తుతం కనిపిస్తున్నాయని, కొత్త పనులు ఏవీ ముందుకు సాగడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ కాలంలో జరిగిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు రంగులు వేసి మళ్లీ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. అమలు చేయలేని 432 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, రైతు భరోసా పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. రైతులు యూరియా కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో నిరుద్యోగ యువత నిరాశలో ఉందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కొత్తగూడెం నియోజకవర్గాన్ని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కేసీఆర్ సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. కొత్తగూడెంను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల తొలగింపు కార్యక్రమం చేపడుతోందని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, ఓటర్ల జాబితాలో పేర్లు కొనసాగుతున్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చిన ఎంపీ రవిచంద్ర, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, కిలారి నాగేశ్వరరావు, వనమా రాఘవేంద్రరావు, కాపు సీతామహాలక్ష్మి, వేల్పుల దామోదర్, కాపు కృష్ణ, బండారు రుక్మేందర్, బాదావత్ శాంతి, కార్పొరేటర్లు గోవాడ గుణచరిత్, వేల్పుల వీరమ్మ, సింధు తపస్వి, మధుచంద్, రాంబాబు, మల్హోత్రా సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

### మహిళ భద్రత పై పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు : జిల్లా షీ టీమ్

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 18 (వాయిస్ టుడే); జిల్లాలో మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు, మహిళలకు సంబంధించిన చట్టాలు మరియు వారి హక్కులపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం గంబీరావుపేట మండలంలోని ముచ్చెర్ల, లింగన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా నిర్భయంగా జిల్లా షీ టీమ్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని షీ టీమ్ అధికారులు తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో సంభాషణలు చేయకుండా జాగ్రత్త వహించాలని, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు లేదా ఇతర వివరాలను గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీనివాస్, ప్రియాంక, శ్రీలత పాల్గొన్నారు.



## ఫుడ్ పాయిజన్‌కు గురైన చిన్నారులను పరామర్శించిన సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్ల, జూన్ 18 (వాయిస్ టుడే); మొన్నటి రోజు ఫుడ్ పాయిజన్ కు గురైన తంగళ్ళపల్లి మండలం కేసీఆర్ నగర్ కు చెందిన చిన్నారులను జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి లో పరామర్శించి, చిన్నారులకు ధైర్యం చెప్పి చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ని వైద్యులను అడిగి తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, శాసన సభ్యులు కల్వకుంట్ల తారక రామారావు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు , స్థానిక టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ టెండర్ల లో అవకత వకలను నిరసిస్తూ.. సిరిసిల్ల మున్సిపల్ ముట్టడి

సిరిసిల్ల, జూన్ 18 (వాయిస్ టుడే); సిరిసిల్ల మున్సిపల్ లోని శానిటైషన్ విభాగం లోని తడి చెత్త పొడి చెత్త ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ నిర్వహించే టెండర్ల లో గత టెండర్ల లో 18 లక్షల 50 వేల రూపాయలకు టెండర్ నిర్వహించగా, ప్రస్తుతం కేవలం ఎనిమిది లక్షలు టెండర్లు నిర్వహించి గతం లో టెండర్ దక్కించుకున్న ఐటిసి సంస్థ నిర్వాహకుడు తిరిగి బినామీ కంపెనీ తో టెండర్ దక్కించుకొని మున్సిపల్ కు దాదాపు పది లక్షల పైగా నష్టం వాటిల్ల చేసిన మున్సిపల్ అధికారులు సదర్ కాంట్రాక్టర్ మున్సిపల్ పాలకవర్గం లేని సమయం లో కొద్ది మంది అధికారులను గోవా ట్రిప్పులకు తీసుకపోయి వారిని మజ్జిగ చేసుకుని టెండర్ల లో ఉన్న లోపాలను తెలుసుకొని బినామీ కంపెనీతో తిరిగి టెండర్ దక్కించుకోవడం జరిగింది. సదరు కాంట్రాక్టర్ గతంలో మున్సిపల్ కు తీవ్ర నష్టం వాటిల్లజేసిన తిరిగి అదే కాంట్రాక్టర్కు అధికారులు కాంట్రాక్టు అప్పజెప్పడం వెనక అర్థం ఏమిటో అధికారులకు తెలవాలి. సదర్ కాంట్రాక్టర్ గతం లో చెత్త రీసైక్లింగ్ కుంభ కోణానికి పాల్పడి మున్సిపల్ లో ఉన్నటువంటి అధికారులను తన పూర్వపు పరిచయాలతో వారి యొక్క బలహీనతలను దృష్టిలో పెట్టుకొని తక్కువ టెండర్ కు కాంట్రాక్ట్ దక్కించుకొని తిరిగి మున్సిపల్ లో తనదైన మార్పు ముద్ర వేసి సిరిసిల్ల పట్టణ ప్రజానీకానికి తీవ్రని నష్టం వాటిల్లో చేస్తూ అక్రమ సంపాదనకు అక్రమ టెండర్ల ద్వారా పూనుకున్నాడు. వెంటనే ఇట్టి కాంట్రాక్టర్ వేసిన టెండర్లను రద్దుచేసి ఓపెన్ టెండర్ నిర్వహించాలని మహిళా సంఘాలకు లేదా మున్సిపల్ సిబ్బందికి కాంట్రాక్టర్ అప్పజెప్పాలని లేని పక్షం లో వచ్చే మంగళవారం పెద్ద ఎత్తున మున్సిపల్ ముందు ధర్నా నిర్వహిస్తామని ఏఐఎఫ్టియు న్యూ పక్షాన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏఐఎఫ్ టి యు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం, ఏఐఎఫ్యూ నాయకులు గుజ్జే దాసు, తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు సెలంద్రి ఎల్లయ్య, తెలంగాణ వంట కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేశం మరియు లక్ష్మణ్, కే రాజు, సత్తయ్య లు పాల్గొన్నారు.





## సదరం శిబిరంలో దివ్యాంగుల అవస్థలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 18: నిర్మల్ జిల్లా లోదివ్యాంగుల నిర్ధారణ శిబిరం నిర్వహించే సదరం క్యాంపుకు ఆ సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడంతొ దివ్యాంగులు అవస్థలుపడ్డారు. అధికారులు దివ్యాంగులపై దయ చూపాలని స్థానికులు వేడుకుంటున్నారు. సిబ్బంది హాజరు కాకపోవడంతో దివ్యాంగులు అంత ఎండ లైన్ లో నిలుచుకొని ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు మండిపడుతున్నారు. దివ్యాంగుల సౌకర్యాల కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇసాక్ అలీ డిమాండ్ చేశారు.

## జూలై 2 ఉద్యమకారుల భూ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: సోను భాయ్





హైదరాబాద్ జూన్ 18: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయతులో జూలై 2 ఉద్యమకారుల భూ పోరాట కార్యక్రమము పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా ఉద్యమకారుల సంఘాలతో కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి పునరీకరణ చేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా బహదూర్పుర ఇన్చార్జి సోను భాయ్ ఆధ్వర్యంలో ఉద్యమకార భూ పోరాటానికి సంబంధించి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ యొక్క సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇంటి స్థలం ఇచ్చేంత వరకు మా పోరాటం ఆగదని ఉద్యమకారులందరూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క సమావేశానికి ప్రోగ్రాం గ్రేటర్ హైదరాబాద్ ఇన్చార్జ్ దుగుంట్ల నరేష్ ప్రజాపతి, తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమతి రాష్ట్ర అధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షులు రామగిరి ప్రకాష్, బీరకాయల మధుసూదన్,గౌరీ గణేష్, కోప్ప శ్రీనివాస్ గౌడ్, రామ్ కోటి, ప్రజాపతి గోపు సదానంద్ ,కొప్పుల అర్జున్ పాల్గొన్నారు.



## కేంద్ర పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలి

### బీజేపీ ఓబీసీ మోర్చా కార్యకర్తలకు పిలుపు

గంగాధర, జూన్ 18 (వాయిస్ టుడే): పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా బీజేపీ ఓబీసీ మోర్చా కార్యకర్తలు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గంలోని గంగాధర మండలంలో నిర్వహించిన బీజేపీ ఓబీసీ మోర్చా మండల సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, సుపరిపాలన సహ కోఆర్డినేటర్ సంఘ నరేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాలు, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందని పేర్కొన్నారు. జన్ కళ్యాణ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బీజేపీ కార్యకర్త లబ్ధిదారులతో మమేకమై కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలైనప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి బింగి వేణు, మల్యాల అధ్యక్షుడు గాజుల మల్లేష్, మండల ఇన్‌చార్జిలు అమ్మరకొండ తిరుపతి, నరేష్, ఆకుల మనోహర్, తిప్పుల వేణి శ్రీనివాస్, ఎర్రబెల్లి పరశురాం, బొమ్మన పరమేష్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, తాళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## చైనా అంతర్జాతీయ వైద్య సదస్సులో డాక్టర్ ఉదయ్ కుమార్ మర్రి పరిశోధనకు ప్రశంసలు"

### కాలేయ వ్యాధుల చికిత్సలో కొత్త మార్గాలకు దారితీసే అధ్యయనం ప్రదర్శన

హైదరాబాద్, జూన్ 18 (వాయిస్ టుడే): హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రముఖ వైద్య సంస్థలో ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగం డైరెక్టర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ ఉదయ్ కుమార్ మర్రి అంతర్జాతీయ వైద్య వేదికపై మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. చైనాలోని సుజౌ నగరంలో నిర్వహించిన ఆసియా--పసిఫిక్ హృదయ, రక్తనాళ మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సంఘం (ఏపీఎస్‌సీవీఐఆర్) వార్షిక సదస్సులో ఆయన కాలేయ వ్యాధిగ్రస్తుల్లో కనిపించే కాలేయ సంబంధిత మెదడు పనితీరు లోపం (హెపాటిక్ ఎన్సెఫలోపతి)పై తన పరిశోధనను ప్రదర్శించారు. కాలేయ వ్యాధులతో బాధపడుతున్న రోగుల్లో తలెత్తే సంక్లిష్ట సమస్యలపై చేసిన ఈ అధ్యయనం సదస్సులో పాల్గొన్న అంతర్జాతీయ వైద్య నిపుణుల ప్రశంసలను అందుకుంది. ఆధునిక ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విధానాల ద్వారా రోగుల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడం, చికిత్స ఫలితాలను మరింత సమర్థవంతంగా చేయడం వంటి అంశాలను ఆయన తన పరిశోధనలో వివరించారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌సీవీఐఆర్ అధ్యక్షుడు జే హ్వాన్ వోన్, భారతీయ రక్తనాళ మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సంఘం అధ్యక్షుడు అమర్ ముఖుంద్‌లను డాక్టర్ ఉదయ్ కుమార్ మర్రి కలిశారు. ఫెలోషిప్ శిక్షణ పొందుతున్న సమయంలో వీరిద్దరూ తనకు మార్గదర్శకులుగా ఉండి, వైద్య పరిశోధన మరియు వృత్తిపరమైన అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు, పరిశోధకులు పాల్గొన్న ఈ సదస్సులో భారతదేశం తరఫున డాక్టర్ ఉదయ్ కుమార్ మర్రి తన పరిశోధనను ప్రదర్శించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచింది. ఆయన పరిశోధన కాలేయ వ్యాధుల చికిత్సలో కొత్త అవకాశాలను సృష్టించడమే కాకుండా, అంతర్జాతీయ వైద్య రంగంలో భారతీయ వైద్యుల ప్రతిభను మరోసారి చాటిందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో వైద్య పరిశోధనలకు విశిష్ట సేవలు అందిస్తూ తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై చాటుతున్న డాక్టర్ ఉదయ్ కుమార్ మర్రికి వైద్య నిపుణులు, సహచరులు, శిష్యులు అభినందనలు తెలియజేస్తున్నారు. ఆయన సాధించిన ఈ ఘనత యువ వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## బీఆర్ఎస్వీ నాయకుడు జిల్ల అక్షయ్ పటేల్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఖండించిన నాయకులు



కూకట్‌పల్లి: జూన్ 18(వాయిస్ టుడే) హైదరాబాద్ నగరం లో గురువారం ఎటువంటి ముట్టడులు, ధర్నాలు లేదా పార్టీ కార్యక్రమాలు లేకపోయినా, బీఆర్ఎస్వీ నాయకుడు జిల్ల అక్షయ్ పటేల్‌ను పోలీసులు ఉదయం ఆయన నివాసానికి వెళ్లి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న నాయకులపై కేసులు నమోదు చేయడం, వారిని వేధించడం, ఎలాంటి కార్యక్రమం లేకపోయినా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. విద్యార్థుల హక్కుల కోసం గొంతెత్తిన వారిని అణచివేయాలని ప్రయత్నించడం సరైన విధానం కాదని అన్నారు. ఈ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనంగా కనిపిస్తోందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. బీఆర్ఎస్వీ నాయకులపై జరుగుతున్న వేధింపులను వెంటనే నిలిపివేయాలని, అక్రమ నిర్బంధాలు మరియు తప్పుడు కేసుల రాజకీయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షిస్తూ విద్యార్థి ఉద్యమాల పట్ల ప్రభుత్వం సహనంతో వ్యవహరించాలని కోరారు.

# మెరుగైన వైద్యం అందించాలి

**పానీ పూరి తిని అస్వస్థతకు గురైన పిల్లలు, పెద్దలు క్షేమం**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

### పానీపూరి తిని చికిత్స పొందుతున్న పిల్లలు, పెద్దలను పరామర్శించిన ప్రభుత్వ విప్

### పండ్లు పంపిణీ చేసిన విప్



రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (వాయిస్ టుడే):పానీ పూరి తిని అస్వస్థతకు గురైన పిల్లలు, పెద్దలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పానీపూరి తిని దాదాపు 30 మంది పిల్లలు, తొమ్మిది మంది పెద్దలు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు ఈ సందర్భంగా వారిని గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరామర్శించారు. వారందరినీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ల నుంచి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా వివరాలు సేకరించారు. వీరిలో 8 మంది డిశ్చార్జ్ అయ్యారని వైద్యులు తెలిపారు. మిగతా వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. స్థానికంగా చికిత్స పొందుతున్న అందరి ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారని ఎప్పటి కప్పుడు వివరాలు చేరవేస్తున్నామని వెల్లడించారు. ప్రజారోగ్య సంరక్షణకు ప్రజా ప్రభుత్వం పటిష్టచర్యలు తీసుకుంటుందని తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఆహార పదార్థాలు విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తామని వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలందరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పానీపూరి విక్రయించి పలువురు అస్వస్థతకు కారణమైన నిర్వాహకుడి పై ఇప్పటికి కేసు నమోదు చేశామని ఆయనపై చర్యలు తీసుకుంటున్నాను స్పష్టం చేశారు. పిల్లలందరూ త్వరగా కోలుకుంటున్నారని త్వరలోనే పాఠశాలలకు తిరిగి వెళ్తారని పేర్కొన్నారు. ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సిబ్బందిని ప్రభుత్వ విప్ అభినందించారు. జిల్లాలో గత రబీ సీజన్ కంటే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అనుకూల పరిస్థితులతో జిల్లాలో దాన్యం దిగుబడి గతంలో కంటే చాలా పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**వివిధ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు**

జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తామని అధికారులు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ అలాగే ఆయా గ్రామాల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో సంయుక్తంగా చేస్తారని ఏమైనా లోపాలు ఉన్న నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ వేములవాడ మున్సిపల్ చైర్మెన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డాక్టర్లు సంతోష్ కుమార్, కపిల్ , జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఫ్రీ ప్రైమరీ పీఎంశ్రీ కేంద్రాలను రద్దు చేయాలి : శైలజ

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 18: నిర్మల్ జిల్లా ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాల ఏర్పాటు ను హద్దుచేసి వాటిని అంగన్వాడీలకే అప్పగించాలని సిఐటియు అనుబంధం తెలంగాణ అంగన్వాడీ యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం నిర్మల్ నగరంలోని గాంధీ పార్క్ వద్ద నిర్వహించిన నిరసనలో జిల్లా కార్యదర్శి శైలజ మాట్లాడారు. ఐ సీ ఎ ఎస్ వ్యవస్థను బలోపేతం చేయాలని అంగన్వాడీ ఉద్యోగులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ తెలంగాణ అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శైలజ అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్‌లో గురువారం భారీ వర్షం

### 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

నాగార్జునసాగర్ జూన్18 వాయిస్ టుడే : నాగార్జునసాగర్ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా కురిసిన వర్షంతో ప్రాంతమంతా తడిసిముద్దైంది. అధికారికంగా 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. భారీ వర్షం కారణంగా ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండగా, లోతట్టు ప్రాంతాల్లో స్వల్పంగా నీటి నిల్వలు కనిపించాయి. కొన్ని రోజులుగా నెలకొన్న ఉక్కపోత వాతావరణానికి ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించింది. వర్షంతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. రైతులు కూడా ఈ వర్షాన్ని సానుకూలంగా స్వాగతిస్తూ, ఖరీఫ్ సాగుకు ఇది ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికులు వర్షాన్ని ఆస్వాదించగా, వాతావరణ శాఖ రానున్న రోజుల్లో కూడా అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది.

## ఐఐటీలో సీటు సాధించిన దీక్షిత రెడ్డికి ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ సన్మానం



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 18: నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యాతాలం చిన్నారెడ్డి కుమార్తె యాతాలం దీక్షిత రెడ్డిలో సీటు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ విద్యార్థిని అభినందించి శాలువాతో సత్కరించారు. దేశంలోనే ప్రతిష్టాత్మకంగా విద్యా వ్యవస్థలో మనం పాత్ర విద్యార్థులు ప్రవేశాలు పొందడం శుభ పరిణామం అని ఆయన కోరారు విద్యార్థు లు లక్ష సాధన దిశగా కష్టపడి చదవాలని సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సోలంకి భీమ్ రావు వెంగల్ రావు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమర్ ఖేడ్‌కు ప్రత్యేక పల్లె వెలుగు బస్సు



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్18: నిర్మల్ జిల్లా నిర్మల్ డిపో మేనేజర్ పండరి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ నుండి మహారాష్ట్రలోని ఉమర్ కేడ్ కు గురువారం నుండి ప్రత్యేక పల్లె వెలుగు బస్సు సేవలు ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజు ఉదయం 7:30 గంటలకు నిర్మల్ బస్టాండ్ నుండి బయలుదేరి ఈ బస్సు పలు గ్రామాలను మీదుగా ఉమార్ కేడ్ చేరుకుంటుంది తిరుగు ప్రయాణంలో ఉమర్ కేర్ నుండి ఉదయం 11:40 గంటలకు బయలుదేరి నిర్మల్ కి చేరుకుంటుంది అని డిపో మేనేజర్ తెలియజేస్తున్నారు.

## కంబాపూర్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 18: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కంబాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర అంజవ్వ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## పీఎం అజయ్ పథకం చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి జూన్ 18 (వాయిస్ టుడే ప్రతినిధి): పీఎం అజయ్ పథకం కింద లబ్ధి పొందిన లబ్ధికారులకు 6కోట్ల 30లక్షల 50వేల రూపాయలు , చెక్కును అందజేసిన శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి మండలంలోని వెలుగు కార్యాలయం నందు పీఎం అజయ్ పథకం కింద లబ్ధి పొందిన లబ్ధిదారులకు ఆరు కోట్ల 30 లక్షల 50 వేల రూపాయలను చెక్కు రూపంలో రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకం కింద ఆటో ను పొందిన లబ్ధిదారుని కుటుంబానికి ఆటోని అందజేశారు.

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళాసాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు తీసుకొని వచ్చిందని, ఇందులో భాగంగానేడు పీఎం అజయ్ పథకం కింద 6 కోట్ల 30 లక్షల 50 వేల రూపాయలు లబ్ధిదారులకు చెక్కు రూపంలో రుణాన్ని అందజేశామని, తద్వారా మహిళలకు స్వయం ఉపాధి పొంది, జీవనాధారం సాగించుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా తాము రాష్ట్రంలో 33% మహిళలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్ కల్పిస్తామని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా 33% మహిళలకు అవకాశం కల్పించే విధంగా తాను కార్యాచరణ చేపట్టనున్న అని తెలియజేశారు, మహిళలు అన్నిరంగంలో అభివృద్ధి పరిచే విధంగా తాను కృషి చేస్తానన్నారు. పీఎం అజయ్ పథకం కింద లబ్ధి పొందిన మహిళలు ఈ అవకాశాన్ని పొందిపుచ్చుకొని, జీవితంలో ఉన్నత శిఖరాలకు అధిరోహించి, ఆర్థికంగా స్వాలంబతతో, ఎదగాలని,ఈ సందర్భంగా మహిళలకు తెలియజేశారు.



## మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలకు మద్దతు తెలిపిన మున్సిపల్ చైర్మన్

జమ్మికుంట, జూన్ 18 (వాయిస్ టుడే ): తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ ఒ వర్కర్స్ యూనియన్ (జ×ఖ) ఆదేశానుసారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ కొలుగురి తిరుపతి, శ్రీనివాస్, రాసపల్లి సంజీవ్, మరేపల్లి ప్రశాంత్ తదితరులు చేస్తున్నటువంటి రిలే దీక్షలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్నవి న్యాయమైన డిమాండ్లు అని, వారు కోరినట్లుగా మున్సిపాలిటిలో పని చేసే ఔటోసోర్సింగ్ ఎన్ఎమ్ ఆర్ ఫిక్స్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలి అని, 2వ పిఆర్సి ప్రకటించి కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి కేటగిరి వేతనాలు అమలు చేయాలి అన్నారు. మున్సిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా డబుల్ బెడ్రూమ్స్, ఇందిరమ్మ ఇల్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, మున్సిపల్ కార్మికులకు మరణిస్తే దహనం ఖర్చులకు 30 వేల రూపాయలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు ఒక్కపూట 8 గంటల పని విధానం అమలు చేసి ప్రతి సంవత్సరం మున్సిపాల్లో పనిచేసే శానిటేషన్, వాటర్ వర్క్స్ హరితహారం, ఎలక్ట్రిషన్, డ్రైవర్లకు రక్షణ పరికరాలు అందజేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో పనిచేసే డ్రైవర్లకు,జవాన్లకు మిగతా వారి వలె డ్రైవర్స్ కేటగిరి వేతనం ఇవ్వాలి అని తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొలుగురి సురేష్,ఫిరోజ్, మంద రాజేష్ ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## విట్టోలి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 18: నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామ ప్రజలకు అవసరమైన పరిపాలనా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు నూతన పంచాయతీ భవనం ఉపయోగపడుతుందని అన్నారు.

అనంతరం గ్రామంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి వారికి శు భాకాంక్షలు తెలిపారు. సొంత ఇంటి కల నెరవేరడం ప్రతి కుటుంబానికి ఆనందదాయకమైన విషయమని పేర్కొంటూ పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,మండల నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## కేజీబీవీ పాఠశాలను అకస్మాత్తుగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 18: నిర్మల్ జిల్లా నిర్మల్ అర్బన్ లోని కేజీబీవీ పాఠశాలను అకస్మాత్తుగా తంచి చేశారు. విద్యార్థులకు విలువలతో కూడి న ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు పాఠశాల పరిసరాలు తరగతి గదులను పరిశీలించారు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్కులను అందించారు. ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఎం ఈ వో పద్మ ఎస్ వో సుజాత జిల్లా అదన కలెక్టర్ వెంకటేశ్వర్లు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 19 జూన్ 2026

## ఈ నెల 20న రెండవ జాతీయ లోక్ అదాలత్

**జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం**

**కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ విజ్ఞప్తి**



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్18: చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగ పరచుకోవాలని లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్‌లి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కక్షిదారులు కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన , తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా ఎస్పీ తెలపడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ నెల 20 న జరిగే..రెండవ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియ జేశారు.ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ (డి డి) కేసులు ,ఈ పెట్టె కేసులు, చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు , సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చున్నారు.అంతేకాకుండా, ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావున, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టులో గల కేసులలో త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్‌లి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పర్యావరణ రక్షణకు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు ప్రగతి**

**హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్.పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి.**

ఝరాసంగం జూన్18 (వాయిస్ టుడే) : జహీరాబాద్, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని జహీరాబాద్ మండల ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లీ గ్రామంలో వన మహోత్సవం - 2026 కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీఓ అశోక్, అలాగే గ్రామ స్తులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటం అత్యంత ఆవశ్యకం అని పేర్కొన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని, సహజ సిద్ధమైన ప్రాణవాయువును అందించేందుకే ఈ వన మహోత్సవం ద్వారా విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే కేవలం అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. అలాగే నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా సంరక్షించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నల్లగొండ జిల్లా సలహాదారుగా చెంగళి జంగయ్య

**ఉద్యమ కారుల సంక్షేమం, ఆత్మగౌరవ పరిరక్షణే లక్ష్యంగా ఫోరం కీలక నిర్ణయం**



నాగార్జునసాగర్, జూన్ 18 వాయిస్ టుడే: తెలంగాణ ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నల్లగొండ జిల్లా సలహాదారుగా చెంగళి జంగయ్య ని నియమిస్తూ ఉత్తర్వులు వెల్లడించినట్టుగా జంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం అధ్యక్షులు డా. బీమా శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేస్తూ, ఉద్యమకారుల సంక్షేమం మరియు ఆత్మగౌరవం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. నల్లగొండ జిల్లాలోని ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, వారికి రావాల్సిన గుర్తింపు, గౌరవం విషయంలో చెంగళి జంగయ్య కీలక పాత్ర పోషిస్తారని ఫోరం నాయకత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. టి.ఎస్. రిజిస్టర్డ్ అయిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఫోరం సభ్యులు, ఉద్యమకారులు ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నారు. చెంగళి జంగయ్య కి నల్లగొండ జిల్లా సలహాదారు బాధ్యతలు అప్పగించిన ఫోరం అధ్యక్షులు డా. బీమా శ్రీనివాస్ కి, రాష్ట్ర కమిటీ సభ్యులకు తెలంగాణ ఉద్యమకారుల తరపున హృదయపూర్వక అభినందనలు. ఉద్యమకారుల కోసం మీరు తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. చెంగళి జంగయ్య నాయకత్వంలో నల్లగొండ జిల్లా ఉద్యమకారులకు మరింత బలం, గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నాం.

# ప్రజల మధ్యే ప్రజాప్రతినిధి సంక్షేమం నుంచి అభివృద్ధి వరకు వరుస కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**పేదల సొంతింటి కల సాకారం.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

**కళాశాలలో ఆకస్మిక తనిఖీ.. విద్యా ప్రమాణాలపై రాజీ లేదన్న ఎమ్మెల్యే**

**గ్రామీణ అభివృద్ధికి మరో అడుగు.. ూ రూ.1 కోట్ల సీసీ రోడ్ల పనులకు శ్రీకారం**

**విఠలేశ్వరుని ఆశీస్సులతో ప్రజాసేవ.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్18: నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశీ నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారులు మంజూరు పత్రాలను సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాలలో విద్యార్థుల హాజరు, బోధన పరిస్థితులు, మౌలిక వసతులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి బోధన నాణ్యతపై ఆరా తీశారు. కొంతమంది ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకుండా సమయపాలనతో బోధన నిర్వహించాలని ఉపాధ్యాయులకు హెచ్చరించారు. విద్యా ప్రమాణాల పెంపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు.

**ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.1 కోటి సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ.**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) నిధులతో సుమారు రూ.1 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్లు గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగిస్తాయని తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే.**

ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ కుభీర్ మండలంలోని ప్రసిద్ధ విఠలేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై చర్చించారు. ఆలయ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసి ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## తెలంగాణ మున్నూరు కాపు పటేల్ సంఘం సుల్తానాబాద్ మండల కన్వీనర్‌గా గొట్టం మహేష్ పటేల్ నియామకం

సుల్తానాబాద్, జూన్-18 వాయిస్ టుడే : తెలంగాణ మున్నూరు కాపు పటేల్ సంఘం సుల్తానాబాద్ మండల కన్వీనర్‌గా పట్టణానికి చెందిన గొట్టం మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కన్వీనర్ పెంట రాజేష్ పటేల్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల స్థాయిలో సంఘ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు మున్నూరు కాపు సామాజిక వర్గ ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా నూతన మండల కన్వీనర్ గొట్టం మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో మున్నూరు కాపు సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువత, విద్యార్థులు, మహిళలను సంఘ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తానని పేర్కొన్నారు. సామాజిక, విద్యా, ఆర్థిక రంగాల్లో మున్నూరు కాపు వర్గ అభ్యున్నతికి సంఘం ద్వారా నిరంతరం సేవలు అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.సంఘం ఆశయాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమిష్టిగా పనిచేస్తూ మండలంలో సంఘానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కన్వీనర్లు, జిల్లా నాయకులు, సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులకు గొట్టం మహేష్ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు, యువ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొని గొట్టం మహేష్‌కు అభినందనలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు..

## న్యాయవాదులు పదవులకు వన్నె తేవాలి

**రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సాముల రాంరెడ్డి**



హుజూర్ నగర్, జూన్ 18 (వాయిస్ టుడే ప్రతినిధి): ఎంతో నమ్మకంతో ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు గా నియమింపబడిన న్యాయవాదులు కష్టించి నిజాయితీగా పనిచేసి ఆయా పదవులకు వన్నె తీసుకురావాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సాముల రాంరెడ్డి, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాసరావు లు ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులైన కాల్వ శ్రీనివాసరావు, చనగాని మహేష్ లను కోరారు. వారి నియామకాన్ని పురస్కరించుకొని గురువారంరాంరెడ్డి, నారపురాజు శ్రీనివాసరావు లు స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గము మరియు న్యాయవాదులతో కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు బలహీనులకు నిజాయితీగా ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం వల్ల పేదల న్యాయవాదులుగా గుర్తింపును పొందటమే కాకుండా నైతిక ఆనందం మిగులుతుందన్నారు. న్యాయమూర్తుల సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ విధుల పట్ల క్రమశిక్షణతో వ్యవహరించాలని వారు కోరారు. ఆర్డీవో కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ కౌన్సిల్ గా నియమించబడిన స్థానిక మహిళా న్యాయవాది జుట్టుకొండ సంధ్య ను కూడా వారు సన్మానించి సత్కరించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన భూక్య నాగరాజు నాయక్, నర్సింగ్ సతీష్ లకు ధ్రువీకరణ పత్రాలు అందించి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ లో నూతనంగా చేరిన మహిళా న్యాయవాది శృతికి వారు సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమణారెడ్డి, రవికుమార్, నట్టే సత్యనారాయణ, అంబటి శ్రీనివాసరెడ్డి, చల్లా కృష్ణయ్య, ధూళిపాల శ్రీనివాసరావు, ఉప్పల గోపాల కృష్ణమూర్తి, చిట్టి పోతుల రమేష్, యాదగిరి, అంజయ్య, శ్రీను నాయక్, వీరు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్ నగర్ పట్టణంలో త్రాగునీటి సమస్యకు పరిష్కారం

**మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్**



హుజూర్ నగర్, జూన్, 18 (వాయిస్ టుడే ప్రతినిధి) : రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల, శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహాయ సహకారాలతో కేటాయించిన 30 లక్షల రూపాయలతో హుజూర్‌నగర్ పట్టణ ప్రజలకు ఎంతోకాలంగా ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గత ఆరు సంవత్సరాలుగా బేతవోలు నుండి హుజూర్‌నగర్‌కు వచ్చే ప్రధాన వాటర్ లైన్ దెబ్బతినడంతో పట్టణ ప్రజలు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి వెంటనే స్పందించి 30 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు.

మంత్రి ప్రత్యేక చొరవతో యుద్ధ ప్రాతిపదికన వాటర్ లైన్ మరమ్మతు, పునరుద్ధరణ పనులు పూర్తి చేయగా, గురువారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, పాలకవర్గ సభ్యులు , మున్సిపల్ అధికారులతో కలిసి నూతనంగా పునరుద్ధరించిన వాటర్ లైన్‌ను పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ "హుజూర్‌నగర్ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారు. పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించిన వెంటనే ప్రత్యేక నిధులు మంజూరు చేసి ప్రతి ఇంటికి నీరు వొచ్చే విధంగా కృషి చేసిన మంత్రి ప్రజాపక్ష పాలనకు నిదర్శనం అన్నారు.

హుజూర్‌నగర్ అభివృద్ధికి మంత్రి ఎల్లప్పుడూ అండగా ఉంటూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తున్నారని తెలిపారు. హుజూర్‌నగర్‌ను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ సతీష్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, ఏఈ వినోద్ కుమార్, కౌన్సిలర్లు అట్లూరి మంజుల, పులిచింతల వెంకటరెడ్డి, సులవ నాగ లక్ష్మి చందు, వల్లపు దాస్ కృష్ణ, బొల్లెద్దు ధనమ్మజైలు, శీలం నాగమణి శీను, దగ్గుపాటి కవిత బాబురావు, నల్లగొండ సుజాత చంటి, చిట్టి పోతుల భద్రమ్మ, దొంతి రెడ్డి పద్మ, కోలా ఉదయ్ బాను, చిన్నపంగు సావిత్రి, యారగని సుష్మ మురళి, బెల్లంకొండ సంధ్య అమర్, నందిగాం శ్రీను, మోదాల కామేశ్వరి సైదులు, వర్క్ ఇన్స్పెక్టర్ నర్సిరెడ్డి, వాటర్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్క్సిస్టు దృక్పథం ద్వారానే మతోన్మాదాన్ని అడ్డుకోగలం

**- వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తీగల జీవన్ కుమార్..**

**- సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ వరంగల్ డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం**




వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 18: దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలను అడ్డుకునే శక్తి కేవలం మార్క్సిజానికి మాత్రమే ఉందని, మత ఉన్మాదులు ఎన్నటికీ దేశభక్తులు కాలేరని, ప్రజా సమస్యల పరిష్కారానికి మార్క్సిజమే మార్గదర్శి అని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తీగల జీవన్ కుమార్ తెలిపారు.

గురువారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ పద్మశాలి కమ్యూనిటీ హాల్ (కామ్రేడ్ మాధవన్న నగర్)లో సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ వరంగల్ డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ రాజకీయ శిక్షణ తరగతులను తీగల జీవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ పెట్టుబడుదారులకు కట్టబెడుతున్నదని, డోనాల్డ్ ట్రంప్ కు మోకరిల్లి దేశ సార్వభౌమాధికారాన్ని, దేశ ప్రయోజనాలకు తూట్లు పొడుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ఈ దేశానికి విశ్వగురువు కాదని ఈ దేశానికి పట్టిన విషపురుగన్నారు.

సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ చంద్రన్న పాల్గొని మాట్లాడుతూ దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతూ, రూపాయి విలువ పతనం అవుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతూ ప్రజలు అనేక అవస్థలు పడుతున్న మోడీ ప్రభుత్వానికి దేశ ప్రయోజనాల పట్ల, ప్రజల సంక్షేమం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలోని విద్యార్థి, యువత మార్క్సిస్టు దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, దేశభక్తి ముసుగు లో బిజెపి దాని అనుబంధ సంస్థలు కొనసాగిస్తున్న మత టెర్రరిస్టు చర్యలను, మారణహోమాలను, పేపర్ లీకేజీలను, స్త్రీలపై అత్యాచారాలను, ప్రశ్నించే వారిపై భౌతిక దాడులను దేశ ప్రజలంతా సంఘటితంగా ప్రతిఘటించాలని, దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు.

సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి "జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు-మన కర్తవ్యాలు"అనే క్లాసును బోధించారు.

రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభానికి ముందు మాస్ లైవ్ పార్టీ జెండాను మైదం పాణి ఆవిష్కరించారు. అనంతరం విప్లవోద్యమంలో అమరులైన వీరులను స్మరిస్తూ అమరవీరుల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు చిర్ర సూరి, నగర కార్యదర్శి మైదం పాణి, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నరసింహారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బోయినపల్లి అజయ్, మాస్ లైన్ డివిజన్ నాయకులు ల్యాదల్ల ఎల్లయ్య, ఉసిల్ల రాజన్న, బోళ్ల రమేష్, సాగర్, సాబిరి కానీ మోహన్, చంటి, మురళి, దయాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు ఘన సన్మానం

తొర్రూరు , జూన్ 18 వాయిస్ టుడే : తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం తొర్రూరు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సంఘం కార్యాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యున్నత మార్కులు సాధించిన పలువురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. తొర్రూరు మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి స్థానశీ కొండ్లె సాయి చరణ్ 557/600, రెండో ర్యాంక్ పుప్పాల హాసిని 552/600 విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య, తొర్రూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, తల్లిదండ్రులు, విశ్రాంత ఉద్యోగుల సమక్షంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఇట్టే సోమారెడ్డి కార్యదర్శి యాకూబ్ కార్యవర్గ సభ్యుల సమక్షంలో శాలువా, మేమెంటో , నగదు పురస్కారాలతో సన్మానించారు. అనంతరం సంఘ సీనియర్ సభ్యుడు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ హనుమాన్ల కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించి, ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది . వారి సేవలు కొనియాడారు. ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దేవిడి వెంకటరెడ్డి , కలకోట సోమయ్య ,ఉపాధ్యక్షులు పి వినోద్ రెడ్డి, కాంతమ్మ, కార్యదర్శులు చెన్నోజు విజయ్ కుమార్, వెంకటనారాయణ వీరభద్రయ్య ,40 మంది విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్**



తొర్రూరు జూన్ 18 వాయిస్ టుడే : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ సూచించారు. గురువారం తొర్రూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ అధ్యక్షతన సీజనల్ వ్యాధుల పట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో పరిశుభ్రతను కాపాడుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. తడి చెత్తను పచ్చ బుట్టలో, పొడి చెత్తను నీలం బుట్టలో వేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభతరం అవుతుందని చెప్పారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఆరోగ్యకరమైన సమాజం కోసం అందరూ పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో తొర్రూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, ఏ.యన్.యం.లు, ఆశావర్కర్లు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

# హనుమాన్ జంక్షన్‌లో ప్రతిభా పురస్కారాలు




కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): బాపులపాడు మండల ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థుల విజయోత్సవ అభినందన సభ కార్యక్రమం శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించినూ4 కార్యక్రమం లో భాగంగా నేడు బాపులపాడు మండల ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించే ఉద్దేశం తో అందరికీ విద్య ఇది మనందరి బాధ్యత అనే నినాదంతో శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ శ్రీదేవి దంపతులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నినాదం పై కార్యక్రమ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలలో పేద ప్రగతి గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎంతో కాలంగా శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ పని చేస్తుంది అని సత్య ప్రసాద్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షులు డివి రమణ ముఖ్యఅతిథిగా మాజీ గన్నవరం శాసనసభ్యులు దాసరి బాలవర్ధన్ రావు, గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వవిప్ యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ ' సత్య ప్రసాద్ కుటుంబ సభ్యులు గుడివాడ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవి కుమార్,మండల విద్యాశాఖ అధికారులు రాంబాల్ సింగ్,కొమ్మ విజయ్ మానవతా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరావు గారు, లైన్స్ క్లబ్ అధ్యక్షులు పంచకర్ల రమేష్ ,పలు జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మానవతా హనుమాన్ జంక్షన్ అధ్యక్షులు గంటా ఇందిరాదేవి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్ర రావు, పలు విద్యవేత్తలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. మాజి గన్నవరం ఎమ్మెల్యే దాసరి బాలవర్ధన్ రావు మాట్లాడుతూ స్రవంతి ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ తమ ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సేవలను విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్, పూలె,సర్వేపల్లి రాధాకృష్ణన్, ఎం కె గాంధి, అబ్దుల్ కలాం లాంటి మహనీయులు జీవితాలు మనకు ఆదర్శం అని ,అందరూ విద్య ద్వారానే గౌరవింపబడతారని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని మనమందరం ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలని పేద విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. గుడివాడ ఒక విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ మాట్లాడుతూ విద్య ద్వారానే అత్యున్నతమైన పరిపాలన ఉద్యోగమైన ఐఏఎస్ ఐపీఎస్ డాక్టర్లు ఇంజనీర్లు తదితర సాంకేతిక నిపుణులు గా వివిధ ఉద్యోగాలు పొందుతారని, ప్రతి ఒక విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పే అన్ని అంశాలు అర్థవంతంగా నేర్చుకుని నైపుణ్యవంతమైన విద్యార్థులుగా మెలగాలని సూచించారు ఆంధ్రప్రదేశ్ క్రీడారంగానికి చెందిన ఖేలో ఇండియా ప్రోగ్రాం లో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు గోల్డ్ మెడలు మరియు మైక్ సెట్ ఆ సంస్థ నిర్వాహకులు మట్టా సుధాకర్ కు అందించి క్రీడా రంగానికి అతను చేస్తున్న కృషిని అభినందించారు గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి మండల ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ మరియు ప్రోత్సహించారు మండలంలో గల అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పదవ తరగతి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలల వారికి అప్పన వీడు మరియు జ్యోతి హై స్కూల్,జె ఎం జె కాలేజీ, హై స్కూల్ ప్లస్ బాపులపాడు ఎంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులందరికీ ప్రోత్సాహక నగదు బహుమతులు అందించి వారి విద్యాభివృద్ధికి స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ చేదోడుగా ఉంటుందని సత్య ప్రసాద్ తెలిపారు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ వార్డు సాధించిన జి శ్రీనివాసరావు ఈ సందర్భంగా సన్మానించారు మొత్తం కార్యక్రమానికి సంగోజు వెంకట చలపతిరావు, జనవిజ్ఞాన వేదిక బాపులపాడు మండల కార్యదర్శిదారపురెడ్డి భాస్కరరావు, దయాల ప్రభాకర్ రావు, పత్తిపాటి రమేష్ లు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు



## శ్రీవీరభద్రేశ్వర స్వామివారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

ఝరాసంగం జూన్ 18 (వాయిస్ టుడే) : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం నాడు కర్ణాటక రాష్ట్రంలోని హుమ్నాబాద్‌లో వెలిసిన ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీ వీరభద్రేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.. కక్కర్‌వాడ గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి, బొప్పన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ యువ నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థన**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి. శ్రీకాంత్ రెడ్డి... తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. పంటలు బాగా పండి, రైతులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని తాము ప్రత్యేకంగా ప్రార్థించినట్లు వారు పేర్కొన్నారు.

## ప్రజారోగ్యానికి మెడికవర్ చేయూత..!

**ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన**

**సర్పంచ్ దీకొండ భూమేష్**

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా జూన్-18 (వాయిస్ టుడే) : సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ దీకొండ భూమేష్ ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామస్థులు మూడు వందల ఎనభై మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ దీకొండ భూమేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో ముఖ్యమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందేందుకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మెడికవర్ హాస్పిటల్ ముందుకు వచ్చి శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు.శిబిరంలో వైద్యులు రక్తపోటు, మధుమేహం, సాధారణ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. అలాగే వ్యాధుల నివారణ, ఆరోగ్యకర జీవన విధానాలపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యుడు న్యాతరి అరవింద్, గ్రామ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ లోకేష్ ,ఎం.డి. జనరల్ మెడిసిన్, దయాబెటాలజిస్ట్ హాస్పిటల్ మేనేజర్ గుర్రం కరుణాకర్, హరీష్, రఘు, హాస్పిటల్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు..



## న్యాయంచేయాలని భర్త ఇంటి ముందు బైఠాయించిన మహిళ

తొర్రూరు, జూన్ 18 వాయిస్ టుడే : తొర్రూర్ మండలం నాంచారిమడూరు గ్రామంలో తనను ఇంట్లోకి అనుమతించడం లేదంటూ గురువారం నాంచారిమడూరు గ్రామానికి చెందిన ఎండి రేష్మా బేగం తన భర్త ఇంటి ముందు బైఠాయించి న్యాయం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలను వేడుకున్నారు. ఈ సందర్భంగా రేష్మా బేగం మాట్లాడుతూ, అదే గ్రామానికి చెందిన ఎండి నబికి మొదటి భార్య ఎండి షమీంకు సంతానం లేకపోవడంతో, ఆమె అంగీకారంతో 2011లో పెద్దల సమక్షంలో ముస్లిం సంప్రదాయం ప్రకారం తన వివాహం నబితో జరిగినట్లు తెలిపారు. అనంతరం కొన్నేళ్ల పాటు తాము ముగ్గురూ ఒకే ఇంట్లో కలిసి జీవించామని చెప్పారు. అయితే, అదనపు కట్నం తీసుకురావాలని భర్త నబి తనను వేధించడంతో తల్లిగారింటికి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో భర్తకు క్యాన్సర్ సోకి మరణించిన విషయాన్ని తనకు తెలియజేయకుండా దహన సంస్కారాలు నిర్వహించారని ఆరోపించారు. తనకు ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఉండాలనే ఉద్దేశంతోనే భర్త మరణ విషయాన్ని సైతం గోప్యంగా ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తకు చెందిన ఆస్తిని మొదటి భార్య అమ్మివేసిందని, ప్రస్తుతం మిగిలిన ఆస్తిని కూడా విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తన భర్త సంపాదించిన ఇంటిలో నివసించే హక్కు కల్పించి, తనకు న్యాయం చేయాలని అధికారులను, గ్రామ ప్రజాప్రతినిధులను, గ్రామ పెద్దలను రేష్మా బేగం వేడుకున్నారు.

## పచ్చని తెలంగాణే లక్ష్యం

**-సనుగుల గ్రామంలో మొక్కలు నాటిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

చందుర్తి, జూన్ 18,వాయిస్ టుడే: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో, రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రకృతి సమతుల్యతను కాపాడటమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' (మన మహోత్సవం) కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ మహోత్సవంలో భాగంగా చందుర్తి మండలం, సనుగుల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై, మొక్కలను నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడుకోవడం ద్వారానే మానవాళి మనుగడ సాధ్యమని, రాష్ట్రంలో గ్రీన్ కవర్ పెంచే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలందరి సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 19 జూన్ 2026



## వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్

ఖమ్మం: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని సూచించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా.. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్ తదితరులు ఉన్నారు..



## విత్తన, ఎరువుల దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయ అధికారుల తనిఖీలు

రఘునాథపాలెం: నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ఉమ్మడిగా రఘునాథపాలెం మండలంలోని విత్తన, ఎరువులు దుకాణాలలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సీఐ ఉస్మాన్ షరీఫ్, వ్యవసాయ శాఖ ఏవో ఆధ్వర్యంలో ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు.



## కార్పొరేట్ విద్య కోసం లక్కీడ్రా

ఆదిలాబాద్ కలెక్టరేట్ : బెస్ట్ ఎవైలబుల్ పథకం (బీఏఎస్ఎస్) కింద కార్పొరేట్ పాఠశాల్లో ప్రవేశానికి గాను దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఎంపికకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఒకటో తరగతిలో 45 సీట్లకు 67 మంది, ఐదో తరగతిలో 47 సీట్లకు 76 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ లక్కీ డ్రా తీశారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు త్వరలో ఆయా కార్పొరేట్ స్కూల్లో ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే హాస్టల్ కోసం రూ.42 వేలు, పాఠశాల ఫీజు రూ. 28వేలు చెల్లించనుందని అధికారులు వెల్లడించారు.



## క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

ఆదిలాబాద్: జిల్లాలో క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా యువజన క్రీడల అధికారి అల్లూరి దయానంద రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మేజర్ ధ్యాన్ చంద్ హాకీ మైదానంలో క్రీడాకారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియాలపై దృష్టి కేంద్రీకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి ఆయనను శాలువాతో సత్కరించారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**వ్యవసాయం,విద్య,వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**రైతుకు మేలు చేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి**

**యూరియా,ఎరువుల లభ్యతపై ఇబ్బందులు లేకుండా చూడాలి**

**ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు చర్యలు అవసరం**

**దిశా సమావేశాలకు తప్పనిసరిగా అధికారులు హాజరు కావాలి**

**వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య**




హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు,జిల్లా 'దిశ' కమిటీ కో–చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (ఐxూనూ) సమావేశంలో ఆమె పాల్గొని పలు శాఖల పనితీరును ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, అధికారులతో కలిసి ఎంపీ కావ్య సమీక్షించారు.

వ్యవసాయ రంగంపై ప్రత్యేకంగా మాట్లాడిన ఎంపీ కావ్య రైతులకు అవసరమైన యూరియా,ఎరువులు,విత్తనాల లభ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. ఖరీఫ్,రబీ సీజన్లకు ముందు కేవలం పది రోజుల ప్రచార కార్యక్రమాలు సరిపోవని,కనీసం రెండు నెలల పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తేనే ఫలితాలు వస్తాయని సూచించారు. రైతు కిసాన్ మేళాల్లో గుర్తించిన సమస్యలను అధికారుల స్థాయిలో పరిష్కరించాలని,రైతులతో నేరుగా సమావేశాలు నిర్వహించి పంటల నిర్వహణ,ఎరువుల వినియోగం,పురుగుమందుల నియంత్రిత వాడకంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా హానికరమైన కలుపు మందుల వినియోగంపై నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం మాత్రమే కాకుండా ఆ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్,బ్రాండింగ్,ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులు సేంద్రీయ సాగు వైపు ఆకర్షితులవ్వాలంటే మార్కెట్ హామీ ఉండాల్సిందేనన్నారు. అంతర పంటల సాగు (ఇంటర్ క్రాపింగ్) రైతులకు నష్టనివారణతో పాటు ఆదాయం పెంచే మార్గమని పేర్కొన్న ఎంపీ కనీసం 60 నుంచి 70 శాతం రైతులు అంతర పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. నేల ఆరోగ్య పరిరక్షణ,సాయిల్ హెల్త్ కార్డుల విస్తరణ,భూసార పరీక్షలను అన్ని మండలాలకు విస్తరించాలని అధికారులను ఆదేశించారు.

గ్రౌండ్ రియాలిటీని ప్రజాప్రతినిధులకు తెలియజేయాలి..

దిశా సమావేశాల అసలు ఉద్దేశ్యం గ్రౌండ్ రియాలిటీని ప్రజాప్రతినిధులకు తెలియజేయడమేనని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు జరిగే ఈ సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై తదుపరి సమావేశానికి స్పష్టమైన పురోగతి నివేదిక ఇవ్వాలని సూచించారు. గత సమావేశ నిర్ణయాల్లో కేవలం 20 శాతం మాత్రమే పురోగతి కనిపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీపీఆర్‌లు తయారు చేయడం, టెండర్లు పిలవడం వంటి పనుల్లో అనవసర జాప్యం వల్ల అభివృద్ధి ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయని అన్నారు. వరంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున అధికారులు అదే స్థాయిలో చురుకుదనం చూపాలని సూచించారు. జిల్లాలో విద్య,వైద్య రంగాల బలోపేతంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు.

**డ్రాపౌట్స్ తగ్గించి ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు చర్యలు**

ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గించి ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని కోరారు. ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు చిన్నారులకు గుడ్ టచ్––బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలియజేశారు.

# రసాభాసగా భారాస సభ్యత్వ నమోదు




కొత్తగూడెం సింగరేణి: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం క్లబ్‌లో గురువారం ఏర్పాటైన భారాస కొత్తగూడెం నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు హాజరై ప్రసంగిస్తున్న క్రమంలో నిరసన వ్యక్తమైంది. రవీందర్‌రావు మాట్లాడుతూ.. పార్టీ శ్రేయస్సే ప్రామాణికంగా పనిచేయాలన్నారు. మున్ముందు అధికారంలోకి వచ్చే పార్టీగా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కొత్తగూడెం మాజీ శాసనసభ్యుడు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావుకు అనుభవం ఉన్న ప్రజాస్వామిక వాదిగా మంచి పేరు ఉందని, 2023 ఎన్నికల్లోనూ కేసీఆర్ కొత్తగూడెం సీటు ఆయనకే ఇచ్చారన్నారు. ఆయన కుమారుడైన రాఘవకు మంచి భవిష్యత్తు ఉందని, తండ్రి అడుగుజాడల్లో నడుచుకోవాలని అనడంతో ఆయన మద్దతుదారులు నిరసన నినాదాలు చేశారు. ఆగ్రహంతో కుర్చీలను విరగ్గొట్టి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రాఘవకు, తక్కెళ్లపల్లి రవీందర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. రాఘవ వేదికపై నుంచి దిగిపోగా వద్దిరాజు తదితరులు సర్దిచెప్పి తిరిగి వేదికపైకి తీసుకురావడంతో గొడవ సద్దుమణిగింది. సమావేశంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, నాయకులు దిండిగల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# పచ్చని తెలంగాణే లక్ష్యం

**- సనుగుల గ్రామంలో మొక్కలు నాటిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

చందుర్తి, జూన్ 18,వాయిస్ టుడే: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో, రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రకృతి సమతుల్యతను కాపాడటమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' (మన మహోత్సవం) కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ మహోత్సవంలో భాగంగా చందుర్తి మండలం, సనుగుల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై, మొక్కలను నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు.

ప్రకృతిని కాపాడుకోవడం ద్వారానే మానవాళి మనుగడ సాధ్యమని, రాష్ట్రంలో గ్రీన్ కవర్ పెంచే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలందరి సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**